# మూడో కోడలి ఫోటు

(కథానిక)

కొత్తలో కొన్నాళ్లు కోడళ్ళిద్దరూ కొంత మంచిగావున్నా, రానురాను సాలు మూల లేని సరసాల్లో సాకులు దొరికించుకొని సాగదీసుకున్నారు. చేసేపనుల్లో చిన్న చిన్న పొరపాట్లను చీమను చింతమానంత చేసుకొని చెంపలు చరుచుకొన్నారు. వీళ్ళిద్దరికీ బెడవటానికి కారణం లేకపోలేదు. పెద్ద కోడలు సీతమ్మ కాపురానికొచ్చి పదేళ్ళయినా పిలవటానికి పిల్ల పీచైనా కలగలేదు. నానాదేవుళ్ళకూ దేవర్లకూ మొక్కింది. వుపవాసాలు వ్రతాలు చేసినా పుట్టి యాడవలేదు. చిన్న కోడలు చిన్నమ్మకు ఏ మొక్కులు, మోకరింపులు లేకుండానే బక్కంగా బల్లి పిల్లలాంటి పిల్లాడు పుట్టాడు. వాడి ఖర్మేమోగాని తల్లివద్ద పాలు లేక గిలగిల గుంజుకునేవాడు. అసలు ఆ పిల్లాడిని చూస్తేనే గుండెలో అన్నం గొంతుకులోకి వస్తుంది. నలుసెక్కడ నలిగిపోతాడో అనుకొని నాగమయ్యనారాధించి నాగేశ్వర్రావు అనునామం తగిలించారు. చిన్నమ్మ పెందలాడే స్నానంచేసేది. పిల్లాడు ఎంత ఏడిచినా అరిచేతిలో పెట్టుకొని నీళ్లు పోసేది. సందెజామున సోకుసోకుగా సింగారించి సంటోడిని సంకనేసుకొని వయ్యారమంతా వొలకపోస్తూ వాకిట్లో నిలబడేది. భర్త సహితం భేష్ అన్నట్లు భార్యవంక చూస్తూ పొంగి పోయేవాడు. వచ్చేపొయ్యే వయ్యారక్కలంతా "చూడండే! బీద వాళ్ళకు బొంగరంలాంటి పిల్లలు, భాగ్యవంతులకు బల్లిపిల్లలేనే" అనుకుంటూ నవ్వుల్ని నోళ్లల్లో నొక్కుకునే వాళ్లు. ఇదంతా చూస్తూంటే సీతమ్మకు సిగ్గయ్యేది. పైట చెరగుతో కన్నీటి చెమ్మల్ని చెరపుకునేది. మొగుడిని తల్చుకొని మొత్తుకునేది. ఏలిక లేక పోయినందుకు ఎక్కిఎక్కి ఏడ్చేది. దీనిగ్గాంగ చీతుతే పూడే ముక్కులాంటి మొక్క మొలిసిందని సిగ్గుశరం లేకుండా టీపుటాపులతో సానిలక్కి గుమ్మంలో గులగరిచ్చుద్దా, మొగుడు చూచికూడా మురుస్తాడంటే, ఛీ! సిగ్గు లేకపోతే సరి. అని అనుకునేది.

ఒకరోజు కోడళ్లిద్దరు కూర్చొని బాతాఖానీ కొడుతున్నారు. పెద్దకోడలు సీతమ్మ "చిన్నమ్మా, చిన్నమ్మా! మా వూర్లోనే, నూర్పుల్లో నూగునిండిన కల్లానికొచ్చిన నెయ్యి నిండిన పప్పన్నం తింటుంటే, అబ్బ! ఏంత రుచనుకున్నావు. నువ్వు తింటానంటే అది వస్తానంటదే. అనుకోకుండానే అరశేరు బియ్యం అఖరైనా ఆకలి ఆరదు" అంది. అంతలో చిన్నమ్మ చిక్కించుకొని "అదికాదక్కా! మనం తినేది రోజూ అదేగా. మావూర్లో కొండకట్టెలకెళ్ళి కొరివికారంతో కలిపినన్నం ఐతే మాత్రం ఆగుద్దా" అనేటప్పటికి సీతమ్మ మాట చెల్లుబడి కాలేదని చరక్కుమంది. "అందుకేనే నల్లకుక్కను తెచ్చి నలిపినలిపి తోమినా నలుపు నలుపే" నంది. ఆ మాట చిన్నమ్మకు సూది పోటైంది. "హు! మొగుడు పెట్టే మెతుకే లేకపోతే మంచినీళ్లుకూడా పుట్టవు నాకు" అని చిన్నమ్మ చేతులు చెరగేసింది. అక్కడనుండి రేగింది శాపనార్థాల యుద్ధం. వుల్లిగడ్డ పొరలకుమల్లె ఎక్కడలేని మాటలను ఏరి ఎంచుకున్నారు. చివరకు మాటలల్లాపోయి ముష్టియుద్ధంలో మునిగారు. అంతలో అందరూ చేరి సెరిసగానికి సాగదీసారు, మొగుళ్లు రావటం చూచి పెండ్లాలు పెళుసు కొమ్మల్లాగ పెళ్లున ఇరుసుకొని పైనబడి మొత్తుకున్నారు. "ఓ రేయ్! నీ పెండ్లాం ఎంత వయసుది అయితే మాత్రం పెద్దదాన్ని పట్టుకొని పడ్డలాగ పొడుసుద్దా!" అని పెద్దోడు అన్నంతనే "ఆ! ఏందీ? పసిబిడ్డ తల్లి అనైనా తలపకుండా ఆమంతున శిగలు పట్టి సివాళ్ళాడిందే, ఇంత చేసి ఏమియెరుగని

యం. సూరి

నంగనాచి తుంగ బుర్రలాగా నక్కుతుంటే కొంకులిరగెయ్యక, కోపు కొస్తున్న నీకు బుర్ర వుండద్దూ" అన్నాడు. ఇక చూచుకోండి పళ్లు పటపట కొరుక్కున్నారు. పంచెలు పైకెగ దోశారు. మూతులెర్రజేసి మీసాలు మెలి సారు. అప్పుడు తలితండ్రులైన గౌరమ్మ, నర సింహాయ్యలు వచ్చి అడ్డంగా నిలబడి ఆపు చేశారు. "నలుగురికి చెప్పాలిసినోళ్లు మీరే ఇట్లాచేస్తే యట్లా?" అని నోర్లు మూశారు. అప్పటినుండి ఈ రోజువరకు కోడళ్లిద్దరిమధ్య కొరివి మండుతూనే వుంది.

మూడవకోడలువస్తే దాని ఓటుతో మెజారిటీ సంపాదించి ఒకరినొకళ్లు మెత్తగా మెద గేద్దామనుకున్నారు. తాలుగింజగాచేసి తయి తక్కలాడిద్దా మనుకున్నారు. అసలు కమల బస్తీబిడ్డ. బస్తీలో మెత్తనాళ్లు వుంటే అంత మెత్తనాళ్లు వుండరు. కరకురకం గనక వుందా, ఘర్లాంగు మాటనైనా గజకర్ణ, గోకర్ణల్లాంటి చాట చెవులు లేకపోయినా పసికట్టి విరుచుక పడతారు. టక్కుటమారాలతో తల దన్నతారు. ఇంక మాటలకు దిగారా! మూశునెల్ల పిండానికైనా దూసేస్తారుగాని మాటలా! కమలొస్తేగాని కాపరాలు కణగించుకుందా మనుకున్నారు. కనుకనే కమల పెండ్లికి కోపు పట్టికొనవరకు లాగుదామనుకున్నారు.

నరసింహాయ్యకు వుగా వచ్చినప్పటినుండి ఈ రోజువరకు పనిచెడి పండకుండా పొలాన్ని పొదుపుచేశాడు. కూలాండ్లను పెట్టాలసి వస్తదని బదుళ్ళకుపోయి బదుళ్ళతో కోతలవరకు ఏకొదవలేకుండా చేసుకునేవాడు. సంక్రాంతి నెలలో చంకలెత్తుతే చరక్కుమనే చలి కాలంలోకూడా ఒంటికి చొక్కా వేసేవాడు కాదు. పొరచుట్టకైనా పొలుమాలకుండా గుల్లాకుతో జిల్లేడుచుట్టి పదిసార్లు కాల్చి పెది మలు కాల్తేగాని పారేసేవాడు కాదు. భార్య గౌరమ్మకూడా పెండతో పిడలుకొట్ట గంతకు తగ్గ బొంత అనే పదాన్ని చిరంజీవి చేసింది. అంత పసినిగొట్టు పిండాలు కాబట్టే చారెడంత సంసారాన్ని చెరువంతచేశారు. అంతకుముందు బుద్ధి గడ్డితిని "కష్టమే ఫలితం" అన్న అనా మకసూత్రాన్ననుసరించి పేదాళ్ళ కొంపలనుండి పెద్ద కోడళ్ళను తెచ్చాడు. ఇప్పుడు అది ఎగిరి దానిస్థానే డబ్బే డబ్బుని పుట్టిస్తుందన్న నిజాయితీ నిలిచింతరువాత పేద కొంపలలో పేలాలు యేగించటానికి నరసింహాయ్యకు ఎట్లా యిష్టముంటుంది. ఏపొలము బీడులేక తాలూకా ఆఫీసులో తహశీలుదారుక్రింద బిళ్ళబంట్రోతు వీరయ్యతో వియ్యమందటం పిసమైన అంగీక రించడు. అందుకనే తనకంటె భాగ్యవంతులతో వియ్యమంది మూటల్లో మునుగుదా మనుకు న్నాడు. కాని గౌరమ్మ గయ్యాళికిమల్లే అన్న కూతురినే కోడలుగా చేసుకోవాలని కలవ రించేది. "మాటలు ముల్లెలులేవని మేనరికాలు మాన్తామా?" అనేది. కొడుకు రామారావు సహితం సిగ్గు బిడియంలేకుండా కమలనే కట్టు కోవాలని కసాయివాడికన్నా కరుగ్గా మాట్లాడేవాడు. పట్టణానికి చదవబోయే ముందే పెండ్లికి మాటిస్తేనే కాలు కదపనన్నాడు. అదీ కాకపోతే పట్టణంలో పాషన్లతో తిరిగే పడుచు నొకదాన్ని పట్టకొస్తానన్నాడు. కాని పడిపూర్లలో అందరితల తన్నినట్లువుండి ఒక్క కొడుకైనా పట్టణం చదువు లేకపోతే పలచగ వుంటుందని, నాలుగేళ్లమాట కదా! అనుకొని అప్పుడు నవ్వాడు.

వీటన్నిటికి తోడు కోడళ్ళ జోపుకాయ టాలు, కోడళ్ళ మాటలకు చెవులు కోసుకునే కొడుకుల వంతపాడటాలు, వ్రాగ్లోవాండ్లముక్తా యింపులతో నరసింహయ్య నీరయిపోయాడు. అడ్డంగా నడవటానికి అండలేక అశించిన ఆశ లన్నీ ఆరి "ఆ" అనకుండా తోక పట్టేవాదం అవలంబించాడు. కమలనే కోడలుగా చేసుకో టానికి అంగీకరించాడు.

నరసింహయ్యది కొస్తాకూస్తో సంసారం కాదాయె. అరుకొండ్ల వ్యవసాయంతో ఇరవై గొర్ల పొలం, ఇరవై దూలాల మిద్దె, నాలుగు సొప్ప దొడ్లు, సోలుపుగా సొప్ప కప్పిన కొష్టాములు, అరుగురు పాలేర్లతో పూటకు పద హారు కంచాలు లేవాలాయె. పెండ్లి కాస్తా పూర్తిచేసి ముసలాళ్ళిద్దరు ఈ బరువు బాధల నుండి బయటపడుదా మనుకున్నారు. పూపి రున్నంతవరకు "హరే రామా, హరే క్రిష్ణా" అనుకుంటూ ఆరిపోదామనుకున్నారు. పెద్ద

కొడుకు లిద్దరూ పొలం పనులు, గొడ్డుగోదాను సమాలించేందుకు, ఇంక చిన్నోడు ఎట్లాగా చిన్నోడే! వాడు చిన్నప్పటినుండి మొరటు పన్లు మొదలే ఎరగడు. సన్నంగా ఎదురు సువ్వకు మల్లె, మెత్తంగా మునగ కొమ్మలాగా పెరిగినోడు. పట్టణపు చదువు చదివినోడు. వాడికి ఇంటి పనులు, పై వ్యవహారాలు అప్ప చెబుదామనుకున్నాడు. పెద్ద కోడళ్లిద్దరకూ ఇంటి పెత్తనం. ఇంక కాబొయ్యే కోడలు కమలతో కాలక్షేపానికి కరువులేదను కున్నారు. పెండ్లి ప్రయత్నాలు చకచక సాగి స్తున్నారు.

"మూడు ముళ్ళతో ముగ్గురు కోడళ్ళు; ముచ్చటగా ముగ్గురు కొడుకులు. ఇంక వాళ్ళకు మాత్రం ఎవరున్నారు ముసలోడు ముసల్దేగా! ఒకళ్ళ మించిన ఒకళ్ళ అందం. ముక్కు మొఖం ముత్యాల్లాగా మిసిమిసి లాడు తున్నాయి. పిల్లోడు పట్నంలో చదివినోడు. పట్టణానికి తగిన పంట్లాములు లేకపోయినా, గోరంచు గ్యాసుకోరు పంచె, బరువు బాధలేని బారు చేతులు, మోకాళ్లు మునిగే అంగి, కస్, కస్, మంటూ కాళ్ళల్లో సాపు చెప్పులు, నూనూగు మీసాలతో బుసబుస లాడుతున్న నడి యౌవనం. పాలరాళ్ళ పసందైన పలి కితే పకపకలాడే పళ్ల పలువు, ఆ బరువు, బారుకు తగ్గట్టు అవయవాల్ని అచ్చుగుద్దినట్లు అందంతో కమలకు తగ్గ కోమలాంగుడే నే, పిల్ల మాత్రం తక్కువతిందా! ఎచ్చు తగ్గులున్నా పిల్లాడికి ఏమాత్రం తగ్గదు. ఇంక వీళ్ళకుమాత్రం ఒక్కతికాని ఒక్క కమలేగా. సరేగానీ! ఆడ పడుచులంతా అత్తోరి ఇంటికి కాపురమేలకాని కెళుతుంటే కెవ్వుమంటూ కవ్వికవ్వి ఏడుస్తారు కదా! దీని గుండె గుండెబండ కాకపోతే ఈడి గానికి కెళుతూ యాడవకుండా ఏలుగుతుందే మంట" అంటూ పెళ్ళి కొచ్చిన పేరంటా ళ్ళంతా ముక్కుమీద వేలేసుకున్నారు. పక్క నున్న పాపమ్మ "ఏమిటే! అట్లా ఆశ్చర్య పోతారు. వస్తూపోతూవున్న మేనత్త కోడు కేగా. పెండ్లి కాకముందే ప్రేమలు పెరిగిన పావురాళ్ళేగా, ఈడుజోడు కుదిరిన గువ్వల జంటేనాయె" అంది. పేరంటాళ్ళ పలుకులు వింటుంటే కమలకు ఆనందం పుట్టపగ్గాలు లేకుండావుంది. అందుకే సడిచప్పుడు లేకుండా బజాబజంత్రీలతో అత్తోరింటికి బయలుదేరింది.

"ఇంక మాపనేదో అయిపోయింది బావా! కమలను నిండు కడవలా చూచినా ఓటిదిలాగ చూసినా అంతా కండ్ల చలవేనాయె. అసలు మీ పిల్లలక్కే చూసుకుంటారనేగా మా ఆశంతా. ఆపిల్లోడు, పిల్లా చల్లంగా వుంటే చూసుకుందామనేగా! మేము పెద్దాళ్ల మయ్యాం. కాళుచేతులున్నంతవరకు కాసుకొని గడుపుతాం. తరువాత మాకుమాత్రం వాళ్ళేగా అండ" అన్నాడు వీరయ్య ఇయ్యంకుడు నరసిం హయ్యతో.

"అదేంటి వీరయ్యా! బలుసాకంతైనా బర వాస లేకుండా మాట్లాడావ్. నీకు తెలియం దేముంది మా సంగతి. పెద్దకోడళ్లు పరాయి వాళ్ళయినా పసందుగా బతకటంలా, ఏ కారాలు మిరాలు లేకుండా? కంటికి రెప్పలాగా కాపాడుకోమూ! దానిలో నీతో బుట్టువు తమల పాకుకు తొడిమలాగా చూస్తదాయె. రెక్కలు విరిగి కండలు కరిగే పనులున్నాయంటే అదీ లేదాయె. వీళ్లు ఎంత ఇరుసుకున్నా ఆ ఇంట్లో పనేగా. ఇంక కమల విషయంలో విచారం దేనికి వీరయ్యా! సరే ఇప్పటికే పొద్దుపోయింది. వేళాపాళాలేకుండా ఇంటికి చేర్తే పరులంతా ఏమంటూరు. ఇంత హంగామాతో పెండ్లిచేసి పూదర్లు, పూరేగింపులు లేకుండా గుమ్మం దాటితే వూర్లో వాండ్లంతా వొకనొక్కను పూసినట్లు పూయరూ! మనకైతే మాత్రం మంచిదా?" అని నరసయ్య అందరితోపాటు ప్రయాణమయ్యాడు.

కమల కొసిపడపోసిన ఘటం కాకపోయినా కరకురకం అనుకున్నారు కోడ ళ్ళిద్దరు. కాని అవసరమొస్తే ఆ కాఠి న్యాన్ని వీళ్ళమీద కూడ వుపయోగిస్తుందని అగంథ కాలా పాపం! కాబట్టే కాపురాని కొచ్చినప్పటినుండి ఓటుకోసరం అడుగులకు మడుగు లొత్తుతున్నారు. పుట్టుపుర్వోత్తరా లన్నీ పూసగుచ్చినట్లు పూదర పోస్తున్నారు. కమల కొత్తది కావటంవల్ల కొరకొరలాడక చెవులప్ప జెప్పింది. రానురాను చేసే పనుల

భారమంతా కమల భుజాలమీద నెడుతున్నారు. చివరకు తిండిపెట్టటం దగ్గరనుండి కంచాలు కడగమనేదాకా వచ్చారు. ఇదంతా కమల గుర్తించింది. సంగనాచుల ఆటలను అణగ ద్రొక్కాలని నిర్ణయించుకుంది.

ఒకనాడు కోడళ్ళిద్దరూ చెరుగుల్ని చిమ్మేసి చతికిలబడి కూర్చొన్నారు. సీతమ్మ "పెండ్లి కూతురా! పళ్లెంలో అన్న మేసక రా అమ్మ. నీ చేతి అన్నం చలవగా!" అంది. సీతమ్మ వైపు చిన్నమ్మ చీదర చూపుచూసి, "నాకూ తీసకరా తోటికోడలా!" అంది. వీళ్ళ మాటలు వినేటప్పటికి కమలకు మండెత్తింది. కూసమిడిసిన తాసులాగా బుస్సుమని "మీరేమన్నా గొడ్లా, మృగాలా! కాళ్లు చేతులేమన్నా చెరిగాయా! క్రొవ్విన కోడమల్లాగ కూర్చొని నా మీద పెత్తనం చేయటం నావద్ద సాగవు తెలుసా? ఎక్కడో బ్రూట్స్ లాగావున్నారే!" అంది. "ఆ ఏందీ! ఇంగ్లీషు ముక్కలన్నీ ఎలిగిస్తున్నావంటే, సూదల్లా పోయి దబ్బలమయ్యావా? నీ బస్తీ బాసల బారు సాగిద్దామనుకున్నావా" అంటూ సీతమ్మ చిన్నమ్మవైపు తిరిగి "ఈ రంకు లెరిగిన బొంకులాడి ఇక్కడ చతికిలించబట్టే ఆ నాజూకు నాపసాని నాలుక నాడించింది" అనేటప్పటికి చిన్నమ్మ చెలరేగి "ఒసే గొడ్డుబోతు గుండ్రాయా!" ఇంకా ఏదో అనబోయేటప్పటికి పిల్లాడి కేక వినబడితే పక్కగదిలోకి పరుగెత్తింది. ఇంక సీతమ్మ కమలవైపు ఒక్క వురుము వురిమి కొంగులు కట్టి గోసి బిగించి, "ఏమే, బస్తీనుండి వచ్చిన బంజారు ముండా, నన్ను మృగాన్నంటావా" అని సీతమ్మ సివంగి లాగా మీదపడి కుమ్మేస్తుంది. చిన్నమ్మ సహితం చీపురు కట్టతో తయారైంది. తననే చీపురుతో చెలగేస్తదని అమాంతంగా సీతమ్మ మీదపడి ముక్కీ ముక్కీ గుద్దుతుంది. వీళ్ళు మాత్రం తక్కువ వాళ్ళా! పీకైనంతవరకు విచక్షణ లేకుండా వంత పలికిస్తున్నారు. "నీ బస్తీ బడాయికి నేను భయపడతానా, నీ వుడతవూపులకు నేనూగుతానంటే? నీ వూసరిల్లి వురుములకు నేను వూరుకుంటానా!" అనుకుంటూ అదికేసుకుంటున్నారు. అంతలో రామారావు వచ్చి కమలను వాళ్ళచేతుల నుండి విడిపించేందుకు తారట్లాడుతున్నాడు, తతిమ్మా వాళ్ళు కూడా వచ్చి ఈ ఘట్టాన్ని చూశారు. మొగుళ్ళు రావటంచూచి మోరెలు సాచి రక్షించమన్నట్లు చూశారు. మొగుళ్ళకు అరికాళ్ళు మండెక్కింది. రక్తం నరనరాన పెరవళ్ళు పెట్టింది. వల్లు వేడెక్కి వెంట్రుకలు నిక్కపొడిచినయ్. ఛంగున చిందులేశారు. బండికొయ్యలు తీసిలాడుకున్నారు. రామారావుకు మొదటియేటి కేతలపగిలి సయ్యాన రక్తం చిమ్మింది. "అమ్మా" అంటూ అక్కడే కూలాడు. రెండోవాడు పెద్దాడిని వేసేటప్పటికి "అయ్యా" అని ఒక్కరుపరచి అవతల పోయి అడ్డంపడ్డాడు. మొగుడు పడటం చూసింది సీతమ్మ. ప్రాణానికి తెగించింది. ప్రక్కనున్న గులకరాయి తీసి గుండుకు గురిపెట్టి రెండోవాడికి వదిలేటప్పటికి దిమ్మతిరిగి క్రిందపడి తన్నుకున్నాడు. పెండ్లాలకు పైకి పగుళ్ళు లేకపోయినా వల్లంతా గుల్లయింది. పక్కపోట్లతో డొక్కలు పోట్లు పుట్టినయ్. మొగుళ్ళమీదపడి పిచ్చికేకలతో గుండెలు గుద్దుకుంటున్నారు. మొగుళ్ళు పోతే మెతుకన్నా దొరకదని తలలు బాదుకుంటున్నారు. పాలేర్లువచ్చి పడివున్నవాళ్ళను ఎత్తి మంచాలపై పండేశారు. పగుళ్ళకు పసర్లు బోశారు. వాపులకు కాపులుకాశారు. కోడళ్లు సహితం "ఓటుకు బదులు పోటు" అనుకొని పోట్లకు పట్లు పట్టించారు.

—:O:—

కాంగ్రెస్ ప్రభుత్వం విధిస్తూన్న క్రొత్తక్రొత్త పన్నులపై వ్యాఖ్యానిస్తూ, ఒక బాధితుడు యీ చైనా సామెతను జ్ఞాపకానికి తెస్తున్నాడు: "గొర్రె బొచ్చును నువ్వు సంవత్సరానికి ఒకసారి కత్తిరించగలవు. కాని, దాని చర్మాన్ని ఒక్కసారి మాత్రమే ఒలవగలవు."